
సాక్షి గుంటూరు

శనివారం । 25 । జనవరి । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 556.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,567 క్యూసెక్కులు విడుదలవుతోంది.



83,066 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు 75,159 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 83,066 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

కొనసాగుతున్న నీటి విడుదల



మాచర్ల : నాగార్జున సాగర్ కుడి కాలువకు గేట్లు ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం 22 అడుగుల ఎత్తులో విడుదల కొనసాగిస్తూ... సాగు, తాగు నీరు అందిస్తున్నారు. మార్చి నెల వరకు విడుదల చేయనున్నారు.

న్యూస్‌రీల్

గోవర్ధనస్వామి ఆలయంలో విశేష కుంకుమార్చన



తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత గోవర్ధనస్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం విశేష కుంకుమార్చన నిర్వహించారు. 211 మంది సువాసినులతో వేద పండితులు రఘు, మాధవ, కేశవలు ఈ పూజను జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి మల్లీశ్వరి అనుమతితో శ్రీహరినామ సంకీర్తన బృందం గురువు పెరవలి వంశీకృష్ణ నేతృత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం కార్యదర్శి ఈ. అమ్మడు నిర్వహణలో జరిగింది. లోక కల్యాణార్థం చేసిన ఈ కుంకుమార్చన ఫలితంగా మనసులో ఉన్న కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. కార్యక్రమంలో అందె బాలచంద్ర మౌళి, మాదాల సాయి హనుమంతరావు, నందికంటి రామాంజనేయులు, సంకీర్తన బృందం మాదాల నాగఅర్చన, అందె రాజేశ్వరి, తన్మయి, తూనుగుంట్ల దుర్గా మల్లేశ్వరి, కొప్పురపు అనిత మాధవి, దంటు శర్వాణి, నందికంటి జయలక్ష్మి, శ్రీపూజిత, కొత్తమాసు పుష్పలత, తన్నీరు శివశంకర్ పాల్గొన్నారు

27న గణపతి సచ్చిదానంద స్వామీజీ రాక




నగరంపాలెం: చౌడవరంలోని దత్తనాథ క్షేత్రం ఆశ్రమానికి ఈనెల 27న అవధూత దత్త పీఠాధిపతి పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, ఉత్తరాధిపతి శ్రీ శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ విచ్చేస్తున్నారని ట్రస్టీ బి.సీతారామిరెడ్డి తెలిపారు. మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ట్రస్టీ డాక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ 56 రోజులు విశ్వ ధర్మ ప్రచారం పేరుతో ఏపీలో పర్యటిస్తున్నారని చెప్పారు. 27వ తేదీ సాయంత్రం ఆశ్రమానికి రానున్నట్లు తెలిపారు. 28న ఉదయం గోపూజ, శ్రీ చక్రార్చన, హోమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం నాదబ్రహ్మ శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆంజనేయ రాగసాగర 'నాద ధ్యాన చికిత్సా కచేరి' ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ పి.గోపీకృష్ణ, ట్రస్టీలు మిట్టపల్లి రాజేంద్రబాబు, వి.డి.గాంధీ, బి. జయలక్ష్మి పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు ముగిసిన శిక్షణ



నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో గత ఐదు రోజులుగా మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు నిర్వహిస్తోన్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) సంయుక్తంగా హైకోర్టు ఎంపిక చేసిన న్యాయవాదులకు నలభై గంటల శిక్షణ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన సమావేశానికి సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి అధ్యక్షత వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం పూర్తిగా కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ అన్నారు. సమస్యల పరిష్కారంలో కక్షిదారులే కీలక పాత్రదారులని చెప్పారు. మధ్యవర్తిత్వంలో కక్షిదారుల ప్రయోజనాలకే విలువ ఉంటుందని తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు చెన్నై నుంచి వచ్చిన అడ్వకేట్స్ సుదర్శనా సుందర్, జి.శశిదేవీలను న్యాయవాదులు సత్కరించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1818 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 56, బ్యాంక్ కెనాల్‌కు 148, తూర్పు కెనాల్‌కు 220, పశ్చిమ కెనాల్‌కు 130, నిజాంపట్నం కాలువకు 120, కొమ్మమూరు కాలువకు 733 క్యూసెక్కులు వదిలారు.

నాటక వేదికగా అతివకు అందలం

- రేపు 'తెలుగు నాటకం–స్త్రీవాదం'పై సదస్సు
- యడ్లపాడుకు రానున్న సాహిత్య, నాటకరంగ ప్రముఖులు
- 250 మందికిపైగా విద్య, సాహిత్య, సాంస్కృతిక రంగ ప్రతినిధులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు సదస్సుల్లో చర్చాగోష్ఠి

యడ్లపాడు: 'తెలుగు నాటకం– స్త్రీవాదం'పై ఈ నెల 26వ తేదీన మేధోమథనం జరగనుంది. ఈ సదస్సుకు సాహితీ ప్రముఖులు, నాటకరంగ ఉద్ధండులు హాజరుకానున్నారు. ఇందుకు యడ్లపాడు మండలం వేదిక కానుంది. కేంద్ర సాహిత్య అకాడమీ, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల వేదిక (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ కార్యక్రమం నిర్వహణకు రంగం సిద్ధమైంది. వేదిక అధ్యక్షులు ముత్తవరపు సురేష్ బాబు అధ్యక్షత జరిగే కార్యక్రమానికి తెలుగు నాటకరంగంలో అపార అనుభవం గడించిన మేధావులు, మహిళా జాగృతికై తమ అక్షరగళంతో పోరాడుతున్న సాహిత్య పురస్కార గ్రహీతలు, విద్యా, సాంస్కృతిక రంగాల్లోని ప్రముఖులు, నాటక దర్శక, రచయితలు, కళాకారులు, స్త్రీవాద రచనలు చేసే కవులు, రచయితలు, వక్తలు సుమారు 250 మందికిపైగా భాగస్వాములు కానున్నారు. 'తెలుగునాటక రంగం–స్త్రీవాదం'పై తమ కలాలతో, గళాలతో జనజాగృతి చేయనున్నారు.



హాజరయ్యే ప్రముఖులు వీరే...

డాక్టర్ ఓల్గా



ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీవాదానికి బలమైన పునాదులు వేసిన రచయిత్రులలో ఓల్గా ఒకరు. 'స్వేచ్ఛ', 'తోడు' వంటి నవలలతోపాటు స్త్రీవాదాన్ని ప్రతిబింబించే వందలాది కథలను రచించారు. కేంద్రసాహిత్య పురస్కారంతో పాటు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న ఈమె కీలకోపన్యాసం చేయనున్నారు.

వల్లూరు శివప్రసాద్...



'హంసధ్వని, వానప్రస్థం, మట్టి మనిషి, ఏకాకినౌక వంటి 30కిపైగా నాటకాలు, నాటికలు రచించారు. పరిషత్తులలో 200పైగా ఉత్తమ నాటక రచయిత పురస్కార గ్రహీతగా నిలిచారు. వందకుపైగా తన రచనల్ని 7 సంకలనాలుగా ముద్రించి, నాటక సాహిత్యానికి మహోపకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా, సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులుగా వ్యవహరిస్తున్న ఈయన స్వాగతోపన్యాసం చేయనున్నారు.

డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ



తెలుగు అధ్యాపకురాలు, ప్రిన్సిపల్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన డాక్టర్ సుశీలమ్మ.. ముళ్ళపూడి వెంకటరమణ రచనలపై పరిశోధన చేసి గౌరవ డాక్టరేట్ పొందారు. స్త్రీవాద నేపథ్యంగా యూజీసీ ప్రాజెక్టుల ద్వారా పరిశోధనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో తెలుగు సాహిత్యంపై పత్ర సమర్పణ చేసిన ఆమె.. ఈ సదస్సులో స్త్రీ చిత్రణపై పత్ర సమర్పణ చేయనున్నారు.

నల్లూరి రుక్మిణి



ఎన్నో సామాజిక ఉద్యమాలలో పాల్గొన్న రుక్మిణి.. మేరువు నెరడు, జ్ఞానం అందరిదీ వంటి నవలలతోపాటు వందలాది వ్యాసాలను రచించారు. స్త్రీవాదన నేపథ్యంలో సాహిత్యపరంగా చైతన్యం చేస్తున్న ఈమె వృత్తిరీత్యా న్యాయవాది. సదస్సులో స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యంపై చైతన్యం తీసుకురానున్నారు.

డాక్టర్ జె. కనకదుర్గ




తెలుగు అధ్యాపకురాలిగా, ప్రిన్సిపల్‌గా సుదీర్ఘకాలం వ్యవహరించిన డాక్టర్ జె.కనకదుర్గ 'సింహాసనం, ద్వాత్రింశిక' వంటి తెలుగు కథ, కావ్యాలలో మహిళల జీవన చిత్రణ అంశాలపై విస్తృత పరిశోధన చేశారు. అనేక గ్రంథాలను, వ్యాస సంకలనాలు, స్త్రీవాదంపై సాధికారకత గ్రంథాలను రచిం చారు. స్త్రీ వైవాహిక సమస్యల చిత్రీకరణపై ఉపన్యసించనున్నారు.

డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు




బహుముఖ ప్రజ్ఞాశాలి, నాటక రచయిత, పరిశోధకుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు 17 నాటకాలు, పలు నాటికలను రచించారు. 'తెలుగు నాటక రంగంలో నూతన ధోరణులు–ప్రయోగాలు', అలాగే గుంటూరు జిల్లా నాటకంగా చరిత్ర వంటి అంశాలను పరిశోధన చేశారు. నాటక రంగంపై పది గ్రంథాలను రచించిన వీరు స్త్రీ చైతన్యంపై జనజాగృతి చేయనున్నారు.

పిన్నమనేని మృత్యుంజయరావు



అనగనగా, రాతిలో తేమ, ఆస్తికులు, గురితప్పిన వేటు, అసత్యం వంటి నాటికలు, కథలు, నవలలు రచించారు. వర్తమాన నాటక రంగంలో రచయితగా గుర్తింపు పొందిన ఈయన రెండో సదస్సుకు అధ్యక్షత వహిస్తారు.

అంబటి మురళీకృష్ణ



తెలుగు సాహిత్యం, నాటక విశ్లేషకులుగా గుర్తింపు పొంది, బాపట్ల వివేక సంస్థ ద్వారా వందలాది సాహిత్య సభలను నిర్వహించారు. అనేక గ్రంథాలను ముద్రిస్తూ, నేడు పలు నాటక పరిషత్తులకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. ఈయన తొలి సదస్సుకు అధ్యక్షత వహిస్తారు.

పి.ఎ. దేవి



రంగస్థలం ఆధునిక వీధి నాటికలను 20కి పైగా రచించి, దర్శకత్వం వహించారు. సామాజిక విశ్లేషకురాలిగా గుర్తింపు పొందారు. జాతీయ, అంతర్జాతీయ నాటకోత్సవాలు, సదస్సుల్లో ప్రసంగించారు. స్త్రీ వికాసంపై ఆమె అవగాహన కల్పిస్తారు.

డాక్టర్ విభానుపుడి సుబ్బరాజు



శతాధిక పద్య నాటకాలను ప్రదర్శించిన రంగస్థల నటుడు. సురభి నాటక రంగంపై పరిశోధన చేసే గౌరవ డాక్టరేట్ పొందారు. వృత్తిరీత్యా తెలుగు అధ్యాపకులైన ఆయన పద్య నాటకంపై అనేక జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. ఈ సదస్సులో స్త్రీ అభ్యుదయంపై ఉపన్యసిస్తారు.

దావోస్ నుంచి చంద్రబాబు దారి ఖర్చులు కూడా తేలేదు

మాజీ మంత్రి అంబటి రాంబాబు



గోపాలపట్నం (విశాఖ): హైదరాబాద్‌ను తానే అభివృద్ధి చేశానని చెప్పుకుని డబ్బాలు కొడుతున్న చంద్రబాబు మందీ మార్బలంతో దావోస్ పర్యటనకు వెళ్లి కనీసం దారి ఖర్చులకు కూడా పెట్టుబడులు తేలేకపోయారని రాష్ట్ర మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తానని చెప్పి అక్కడి నుంచి తెచ్చింది 'సున్నా' అని విమర్శించారు. శుక్రవారం విశాఖ వచ్చిన అంబటి విమానాశ్రయంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు సహా పెట్టుబడుల కోసం దావోస్ వెళ్లిన ఓ మంత్రి రెడ్ బుక్ కోసం మాట్లాడుతాడన్నారు. మరో మంత్రి లోకేష్ సీఎం కావాలని భజన చేస్తాడన్నారు. అసలు వీళ్లు దావోస్ వెళ్లిన పని ఏంటి.. అక్కడి చేసిందేంటని ప్రశ్నించారు. దావోస్ నుంచి రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు తెచ్చారో ప్రజలకు తక్షణమే తెలియజేయాలని డిమాండ్ చేశారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో హైదరాబాద్ తరువాత విశాఖను ఐటీ హబ్‌గా చేయాలనుకున్నారని గుర్తు చేశారు. అమరావతిని ఎంత అభివృద్ధి చేసినా నీట మునగడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలలను వైఎస్ జగన్ ప్రారంభిస్తే వాటిని చంద్రబాబు ప్రైవేటు సంస్థలకు అమ్మేస్తున్నారని విమర్శించారు.

నేరాల నియంత్రణకు పటిష్ట నిఘా

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట నిఘా ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా కోర్టు రోడ్డులోని జిల్లా క్రైం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. నేరాల దర్యాప్తు, నేరస్తుల సంఖ్య, వారి గుర్తింపు, పనితీరు, చోరీ కేసుల్లో సొత్తు స్వాధీనం తదితర అంశాలపై ఆరా తీశారు. నేరాల నియంత్రణకు అనుసరించాల్సిన మెళకువలను సీసీఎస్ పోలీస్ అధికారులు, సిబ్బందికి వివరించారు. వేలిముద్రలు, బాధితుల నుంచి వివరాల సేకరణ, అనుమానితులపై ఆరా, చోరీలు జరిగిన తీరును బట్టి దొంగలు ఎవరనేది ముందస్తుగా ఆలోచన చేయాలని తెలిపారు. కొద్దిపాటి క్లూ లభించినా, ఆ దిశగా కేసు దర్యాప్తు వాయువేగంతో చేపట్టాలని చెప్పారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరస్తులు కొత్త పద్ధతుల్లో చోరీలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నేరాల కట్టడికి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సీసీఎస్ పోలీసులు ఉపయోగించాలని చెప్పారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ విధానంపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఊరెళ్లినప్పుడు దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించే దిశగా ప్రజల్లో చైతన్యం తేవాలని సూచించారు. నేరాల దర్యాప్తు, విధి నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు దృష్టికి తేవాలన్నారు. ఇటీవల జిల్లాలో పగలు, రాత్రి వేళల్లో జరుగుతున్న దోపిడీలు, దొంగతనాలు, బంగారపు గొలుసులు తెంచుకెళ్లడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ స్పష్టం చేశారు. కేసుల్లో అరెస్ట్ అయిన వారికి శిక్షలు పడేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ, డీఎస్పీ శివాజీరాజు, సీఐలు సుబ్బారావు, అనురాధ ఉన్నారు.



జిల్లా ఎస్పీకి వివరిస్తున్న డీఎస్పీ

పది పరీక్షలకు ఏర్పాట్లు



- రెగ్యులర్‌తో పాటు దూరవిద్యకు కలిపి నిర్వహణ
- మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు
- 150 కేంద్రాల ఏర్పాటు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు జరగనున్నాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 28,358 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ 27,458 మంది ఉండగా, గతంలో పరీక్షల్లో తప్పిన మరో 900 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 150 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏడు పేపర్ల విధానంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం మార్పులు తెచ్చింది. రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా దూరవిద్య అభ్యర్థులకు సైతం పబ్లిక్ పరీక్షలను నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. గతేడాది వరకు రెగ్యులర్ టెన్త్ విద్యార్థులకు ఉదయం పూట పబ్లిక్ పరీక్షలు ముగిసిన తరువాత ఓపెన్ స్కూల్ సొసైటీ అభ్యర్థులకు వారి సంఖ్య ఆధారంగా అవే కేంద్రాల్లో మధ్యాహ్నం నుంచి దూరవిద్య పరీక్షలు నిర్వహించేవారు. అయితే, ప్రస్తుతం గత విధానంలో మార్పులు తీసుకువచ్చిన విద్యాశాఖాధికారులు రెగ్యులర్ టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో పాటు దూరవిద్య టెన్త్ అభ్యర్థులకు అవే కేంద్రాల్లో ప్రత్యేకంగా మరొక గదిలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


అక్రమాలకు ఆస్కారం లేకుండా పరీక్షల నిర్వహణ

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో తప్పిదాలు, అక్రమాలకు ఆస్కారం లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాం. రెగ్యులర్ విద్యార్థులతో పాటు దూరవిద్య అభ్యర్థులకు కలిపి పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. తద్వారా పరీక్షల నిర్వహణపై మరింత నిఘాను పెంచేందుకు అవకాశం కలుగుతుంది. అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులను పూర్తిస్థాయిలో పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలి.

– సీవీ రేణుక, జిల్లా విద్యాశాఖాధికారి

రవాణాశాఖ 'స్మార్ట్'గా వసూలు

- మళ్లీ తెరపైకి స్మార్ట్ కార్డుల ప్రక్రియ
- డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలకు అందజేయాలని ప్రభుత్వ నిర్ణయం
- కార్డుకు రూ.235 ఆన్‌లైన్‌లో వసూలు
- కనీసం టెండర్లు కూడా ఇవ్వకుండా కార్డులు జారీ జరిగేనా ?
- అయోమయంలో వాహనదారులు



స్మార్ట్ కార్డు నమూనా

పట్నంబజారు: డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలకు మళ్లీ స్మార్ట్ కార్డుల పక్రియను కూటమి ప్రభుత్వం మరోసారి తెరపైకి తెచ్చింది. గతంలో రవాణాశాఖ అధికారులు ఈ– ప్రగతి, పరివాహన్ పోర్టల్ ద్వారా సేవలు అందించేవారు. ప్రస్తుతం వాహన్ సారథి పోర్టల్ ద్వారా అందిస్తున్నారు. ప్రస్తుతం వాహనదారులు దరఖాస్తు చేసుకున్న క్రమంలో ఆర్‌సీ, ఎల్‌ఆర్‌లకు సంబంధించి రూ కార్డుకు రూ.235 చొప్పున వసూలు చేస్తున్నారు. కార్డు ఫీజు రూ. 200, పోస్టు ద్వారా పంపడానికి రూ.32, ఇతరత్రా కలిపి రూ. 235 మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. అయితే, టెండర్లు పిలువకుండా కార్డుల ముద్రణ ఎలా సాధ్యపడుతుందని, ఈ విషయంలో ఎలాంటి స్పష్టత కూడా లేదనే వాహనదారుల నుంచి విమర్శలు వస్తున్నాయి. దీనిపై రవాణాశాఖ అధికారుల్లో సైతం సరైన స్పష్టత లేకుండా పోతోంది. కనీసం వారికి కూడా కార్డులు ఎప్పుడు వస్తాయి.. ఎన్ని వస్తాయి ?అనే వివరణ తెలియకపోవడం గమనార్హం. గుంటూరు జిల్లాలో 40వేలకు పైగానే కార్డులకుపైగా అవసరమయ్యే అవకాశం ఉందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

అయోమయంలో వాహనదారులు

వాహన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే క్రమంలో ముందుగా రాష్ట్రం, జిల్లా వారీగా దరఖాస్తుదారుని వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. అనంతరం చలానా కట్టే సమయంలో స్మార్ట్ కార్డు పేరుతో నగదు వసూలు చేస్తున్నారు. కనీసం టెండర్లు కూడా పిలవకుండా కార్డుల జారీ చేయడం ఎలా సాధ్యపడుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో వాహనదారులకు అయోమయ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయితే, టెండర్ల ప్రక్రియ రూపుదిద్దుకోకుండా ఫీజు వసూలు చేయడంపై వాహనదారుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

నిత్యం రద్దీగా కార్యాలయం

జిల్లాలో నిత్యం రద్దీగా ఉండే వాటిల్లో రవాణాశాఖ కూడా ఒకటి. నిత్యం సుమారు 100 నుంచి 150 మంది లైసెన్స్‌ల నిమిత్తం కార్యాలయానికి వస్తుంటారు. వీటితో పాటుగా ఆర్సీలకు సుమారుగా వంద మందికిపైగా వస్తూనే ఉంటారు. కరోనా వ్యాప్తి కారణంగా స్మార్ట్ కార్డుల జారీకి బ్రేకులు పడ్డాయి. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలలో 60వేలకు పైగా పెండింగ్‌లో ఉన్న కార్డులను వారి నివాసాలకు పోస్టల్ ద్వారా రవాణాశాఖ చేర్చింది. మారుతున్న కాలానికి అనుగుణంగా అరచేతిలోనే సేవలను పొందేలా రవాణాశాఖ చర్యలు చేపట్టింది. స్మార్ట్ కార్డుతో వాహనదారుల సమస్యలకు చెక్ పెట్టవచ్చు. దీనిపై ఆర్టీఏ అధికారులను వివరాలు అడగగా, పూర్తిస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సిన అంశమని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఆప్షన్‌లు కూడా ఏర్పాటు చేసేందుకు దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్ కార్డు అంశంపై దృష్టి సారిస్తామని చెప్పారు.

ఇన్‌స్టా లవ్

- యువకుడి మాయమాటలతో బెంగళూరుకు పయనమైన బాలిక
- ఆ బాలికకు తోడుగా మరో ఇద్దరు బాలికలు
- గంటల వ్యవధిలోనే ఆచూకీ తెలుసుకున్న సింగ్‌నగర్ పోలీసులు
- పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు



మాట్లాడుతున్న ఏసీపీ స్రవంతిరాయ్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇన్‌స్టాగ్రామ్‌లో మూడు నెలల క్రితం పరిచయమైన ఓ వ్యక్తి మాయమాటలు నమ్మి ఓ బాలిక ఇల్లు వదిలి బెంగళూరుకు పయనం కాగా.. ఆమెకు తోడుగా మరో ఇద్దరు బాలి కలు వెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నార్త్‌జోన్ ఏసీపీ స్రవంతిరాయ్ తన కార్యాలయంలో ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు.

పెళ్లి చేసుకుంటానని మాయమాటలు..

న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన ఓ బాలిక సమీపంలోని ఓ మదర్సాలో చదువుకొని ఇంటి వద్దే ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో బెంగళూరుకు చెందిన యువకుడితో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. వీరిద్దరి మధ్యలో ఆ యువకుడి స్నేహితుడైన గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన వేణు(23) అనే యువకుడు రావడంతో వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి వారు దూరంగా ఉంటుండగా.. మూడు నెలల క్రితం నుంచి వేణు ప్రేమ పేరుతో ఆ బాలికకు మాయమాటలు చెబుతూ వచ్చాడు. తనతో వస్తే బెంగళూరు తీసుకెళ్లి పెళ్లిచేసుకుంటానని నమ్మించడంతో అతగాడి మాటలు విన్న ఆ బాలిక విషయాన్ని తన ఇద్దరి స్నేహితులకు చెప్పింది. దీంతో ఆ ఇరువురు బాలికలు తాము కూడా బెంగళూరు వస్తామని చెప్పడంతో వేణు వారిని తెనాలికి రమ్మని చెప్పాడు. ప్రణాళిక ప్రకారం బాలికలను గురువారం రాత్రి తెనాలికి రప్పించిన వేణు అక్కడ తన స్నేహితులైన కేతవత్ యువరాజ్‌నాయక్(21), పెద్ద వెంకటేశ్వర్లు(30)ను బాలికలకు పరిచయం చేశాడు. ఉదయాన్నే బెంగళూరుకు రైలులో వెళ్దామని, టికెట్లు కూడా తీసుకున్నామని బాలికలకు చూపించాడు. ఈ రాత్రికి మనం అందరం గుంటూరు జిల్లా చేబ్రోలులోని పెద్ద వెంకటేశ్వర్లు ఇంట్లో ఉందామనుకొని పయనమయ్యారు.

గంటల వ్యవధిలో బాలికల ఆచూకీ..

ముగ్గురు బాలికలు కనిపించడం లేదంటూ గురువారం రాత్రి 11 గంటల సమయంలో సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో సింగ్ నగర్ సీఐ వెంకటేశ్వర్లు వెంటనే స్పందించి.. ఎస్ఐ సేనాపతి శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుల ఇన్‌స్టాగ్రామ్ ఐడీ నంబర్లు, బండి నంబర్ల ఆధారంగా పోలీసులు తెనాలి చేరుకొని బాలికలు, ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరులో ఉంటున్న బాలిక పాత స్నేహితుడు నిందితులను పట్టించడంలో పోలీసులకు సహాయం చేసినట్లు తెలిసింది. బాలికలను వీరు వేరే రాష్ట్రంలోకి తీసుకువెళ్లి వారి జీవితాలను నాశనం చేసేందుకు పన్నాగం పన్నినట్లుగా తెలుస్తోంది.

మరో కేసు కూడా..

అదేరోజు అదే ప్రాంతానికి చెందిన మూడో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలిక కూడా అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందగా ఆ బాలిక ఆచూకీని కూడా గంటల వ్యవధిలోనే గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఏసీపీ వివరించారు. ఒకే రోజు రెండు కేసులలో నలుగురు బాలికల ఆచూ కీని తెలుసుకొని, కేసులను ఛేదించిన బృందాలను సీపీ రాజశేఖర్ బాబు, డీసీపీ రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించినట్లు స్రవంతిరాయ్ తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,600** గరిష్ఠం : రూ. **3,200**

మోడల్ ధర రూ. **2,900**

క్లుప్తంగా

ఐదో తరగతి విద్యార్థిని చితకబాదిన టీచర్



పెదకాకాని: విద్యార్థి శరీరంపై ఉపాధ్యాయిని వాతలు పడేలా కొట్టడంతో అది చూసి తట్టుకోలేక వేదనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాలుడి తాతయ్య కనపర్తి మాణిక్యరావు శుక్రవారం తెలిపిన కథనం ప్రకారం.. పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామ ఏరియాలోని దేవరాయబొట్లవారిపాలేనికి చెందిన కనపర్తి సురేష్‌బాబు, నీలిమ దంపతుల కుమారుడు మహీధర్ గ్రామంలోని సిద్దార్థ పబ్లిక్ స్కూల్‌లో ఐదో తరగతి చదివిస్తున్నారు. ఎప్పటి మాదిరిగానే గురువారం స్కూల్‌కు వెళ్లిన మహీధర్‌ను స్కూల్ టీచర్ శరీరంపై వాతలు పడేలా కొట్టింది. ఇంట్లో చెబితే మళ్లీ కొడతానని బెదిరించింది. మహీధర్‌తో పాటు మరో ఇద్దరిని కూడా కొట్టినట్లు సమాచారం. ఇంటికి వెళ్లిన మహీధర్‌కి తల్లి స్నానం చేస్తుండగా శరీరంపై కమిలిపోయిన గాయాలు కనిపించాయి. దీంతో కుమారుడిని వెంట బెట్టుకుని పెదకాకాని పోలీసులను ఆశ్రయించారు. స్కూల్‌లో జరిగిన ఘటనపై పోలీసుస్టేషన్‌లో వివరించారు. దీనిపై పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామిని వివరణ కోరగా పోలీసు స్టేషన్‌కు వచ్చిన మాట వాస్తవమేనని, బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు. పాఠశాల యాజమాన్యాన్ని నిలదీయగా ఇష్టం వచ్చింది చేసుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లు బాలుడి తాత కనపర్తి మాణిక్యరావు తెలిపారు. సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ నిర్వాహకుడు కట్టా శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాధులను ముందే పట్టేస్తున్నారు..

- ఇంటింటికి ఉచితంగా వైద్య పరీక్షలు
- ఎన్‌సీడీ 3.0 కార్యక్రమం కింద పరీక్షలు
- బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులను ముందస్తుగా నిర్ధారణ

గుంటూరు మెడికల్: సాధారణంగా సీజన్‌లో వ్యాధులు చుట్టుముడతాయి. సకాలంలో స్పందించకపోతే వైద్యశాలల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిందే. వీటి నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం వినూత్నంగా ఎన్‌సీడీ 3.0 కార్యక్రమాన్ని నవంబరు 14న ప్రారంభించింది.

సర్వే కింద వ్యాధుల గుర్తింపు...

గుంటూరు జిల్లాలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) 3.0 కార్యక్రమంలో భాగంగా 2024 నవంబరు 14 నుంచి ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య సిబ్బంది ప్రతి రోజూ పది ఇళ్లకు వెళ్లి ఇంట్లోని ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయా, లేదా అనే విషయాలను వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి తెలుసుకుంటున్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను ముందస్తుగా గుర్తించి వ్యాధి నివారణ, నియంత్రణకు మందులు ఉచితంగా అందిస్తున్నారు. వారానికి 45 గృహాలను సందర్శించి 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి రక్తపోటు, మధుమేహం, నోటిక్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. క్యాన్సర్ అనుమానిత కేసులు గుర్తిస్తే తక్షణమే వారిని ప్రతి మంగళవారం, గురువారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్‌సెంటర్‌కు తీసుకెళుతున్నారు. నాట్కో సెంటర్‌లో మెమోగ్రామ్, బయాప్సి, పెట్‌సిటీ, తదితర క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి నిర్ధారణ జరిగితే ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

17 లక్షల మందికి పరీక్షలు లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాలు జనాభా 17,19,054 మంది ఉన్నారు. ఎన్‌సీడీ 3.0 కార్యక్రమంలో భాగంగా వీరందరికి ఉచితంగా బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. 2024 నవంబరు 14న ప్రారంభం కాగా, 2025 జనవరి 22 నాటికి 2,22,010 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. పరీక్షలు చేసిన వారిలో 1,431 మంది బీపీ, 1552 మంది షుగర్, ఇరువురు నోటిక్యాన్సర్‌తో, ఎనిమిది మంది రొమ్ము క్యాన్సర్‌తో, ముగ్గురు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు.

వైద్య సిబ్బందికి సహకరించాలి



వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి చేస్తున్న ఆరోగ్య సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలి. కుటుంబ సభ్యులంతా వారి ఆరోగ్య వివరాలు తప్పనిసరిగా అందించడం ద్వారా భవిష్యత్‌లో వ్యాధులు రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకునే అవకాశం కలుగుతోంది. ప్రజలు అపోహలు వీడి ముందస్తుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యంగా క్యాన్సర్ నివారణే లక్ష్యంగా ఉచిత స్క్రీనింగ్ పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులకు చెక్



ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ప్రజలను కాపాడేందుకు ముందస్తుగా వైద్య సిబ్బంది ద్వారా ఇంటింటికి చేస్తున్న ఉచిత వైద్య పరీక్షలు ఎంతో ఉపయోగం. ముఖ్యంగా బీపీ, షుగర్ వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు తద్వారా కిడ్నీలు పాడవకుండా కాపాడేందుకు ముందస్తు వైద్య పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయి. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా కొద్దిపాటి జాగ్రత్తలతో కాపాడుకోవచ్చు.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్



క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు. మామో గ్రామ్ పరీక్ష ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి నివారించవచ్చు. సర్వేకల్ క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించుకుంటే వ్యాధి దరి చేరదు. హైరిస్క్ గ్రూపునకు చెందిన వారు కుటుంబంలో క్యాన్సర్ బాధితులు ఉన్నవారు తప్పనిసరిగా ముందస్తుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు

27న 'నిధి ఆప్‌కే నికత్'

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి(ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని ఈఎస్ఐసీ డీసీబీఓ, కృష్ణాజిల్లా పెద్ద అవుటపల్లిలోని హైటెక్ ప్రింట్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఒంగోలులోని హెడ్ పోస్టాఫీసు ఎదుట ఉన్న పీడీసీసీ బ్యాంక్, విజయవాడ గాంధీనగర్‌లోని ఈఎస్ఐసీ బ్యాంచ్ కార్యాలయం, బాపట్లలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేటలోని కేరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగే నిధి ఆప్‌కే నికత్‌లో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

పొన్నూరు టౌన్ ఎస్ఐ సస్పెన్షన్

ముగ్గురు కానిస్టేబుళ్లు బదిలీ..

నగరంపాలెం: పొన్నూరు పట్టణ ఎస్ఐ రాజ్‌కుమార్‌ను సస్పెండ్ చేయడంతో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పొన్నూరు పట్టణ ఎస్ఐ రాజ్‌కుమార్, న్యాయవాది బేతాళ ప్రకాశరావు మధ్య చోటుచేసుకున్న ఘటనపై డీఎస్పీతో ప్రాథమిక విచారణ చేయించారు. నివేదిక ఆధారంగా ఎస్ఐపై సస్పెన్షన్‌తో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లను బదిలీ చేసినట్లు జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

కోటప్పకొండ సినిమా షూటింగ్



నరసింహరాజుకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకులు

తెనాలి: రాబోయే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పల్నాడులోని ప్రముఖ దేవాలయం కోటప్పకొండ స్థలపురాణం ఆధారంగా చిత్రీకరిస్తున్న సినిమాలోని కొన్ని సన్నివేశాలను శుక్రవారం తెనాలిలో చిత్రీకరించారు. ప్రముఖ జానపద నటుడు నరసింహరాజు శివుడిగా నటించిన సన్నివేశాలను చిత్రదర్శకులు నరేష్ దోనె, మణివరన్ తీశారు. చిత్ర వివరాలను స్థానిక 'మా–ఏపీ' కార్యాలయంలో సాయంత్రం విలేకరుల సమావేశంలో సినీ దర్శకుడు దిలీప్‌రాజా వివరించారు. మహాశివరాత్రి రోజున కోటప్పకొండకు లక్షలాది భక్తులు తరలిరావడానికి గల కారణాలను విశ్లేసిస్త వాస్తవ స్థలపురాణాన్ని అందమయిన దశ్యరూపంగా భక్తజనరంజకంగా చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. కీలకమైన సన్నివేశాలను కోటప్పకొండలో తీసినట్టు చెప్పారు. జానపద చిత్రాల నటుడు నరసింహరాజు, బస్టాప్ కోటేశ్వరరావు, స్వాతి, ఎరబాబు, సునీత, స్వామి సత్యదేవ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. మేకప్. గండికోట జనార్దన్, కెమెరా: మైనేని హరి శ్రీనివాస్, కాస్ట్యూమ్స్: పట్నాల పార్వతి, కాగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం నరేష్ దోనే, మణివరన్.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు 17 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న కార్పొరేటర్లు

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ స్థాయి సంఘ(స్టాండింగ్ కమిటీ) ఎన్నికకు 17 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు తెలిపారు. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి ఫిబ్రవరి 3న ఎన్నిక జరుగుతుందని చెప్పారు. 22 నుంచి 24వ తేదీ వరకు 17 మంది నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. నామినేషన్లను ఈ నెల 27న ఉదయం 11 గంటల నుంచి పరిశీలన, అనంతరం అర్హత కల్గిన నామినేషన్లను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. షేక్ రోషన్, యాట్ల రవి కుమార్, అచ్చాల వెంకట రెడ్డి, అడకా పద్మావతి, రాజలత బూసి, అంజలి మర్రి, పఠాన్ రిహాన, దూపాటి వంశీబాబు, గోపి శ్రీనివాస్, పోతురాజు సమత, కొమ్మినేని కోటేశ్వరరావు, దాసరి లక్ష్మీదుర్గ, తేలుకుట్ల హనుమాయమ్మ, ముప్పవరపు భారతి, నూకవరపు బాలాజీ, షేక్ మీరావలి, ఈరంటి వర ప్రసాద్ నామినేషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు.

బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బ్యాంకర్స్ కమిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్



కౌలు రైతులకు సూచనలు చేస్తున్న స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ కో ఆర్డినేటర్

తాడేపల్లిరూరల్: సీసీఆర్‌సీ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్క కౌలు రైతు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్ కోరారు. తాడేపల్లి మండల పరిధిలోని వడ్డేశ్వరంలో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర విస్తృత సమావేశానికి శుక్రవారం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డు ఉన్న కౌలు రైతులు బ్యాంకు రుణం పొందేందుకు కార్డుతో పాటు ఆధార్ కార్డు ఉంటే సరిపోతుందని, దీని ద్వారా రిజర్వ్ బ్యాంక్ గైడెన్స్ ప్రకారం ఎటువంటి హామీ లేకుండా రెండు లక్షల రూపాయల రుణం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ దేశంలో తిండిగింజలు పండిస్తోంది కౌలు రైతులు అని, వారిని ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యతతో పాటు బ్యాంకుల బాధ్యత కూడా ఉందని అన్నారు. కౌలు రైతులు ప్రైవేటు సంస్థలు ఇచ్చే అప్పులకు పోయి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడవద్దని, తక్కువ వడ్డీతో వచ్చే ప్రభుత్వ బ్యాంకుల్లో మాత్రమే రుణాలు తీసుకోవాలని సూచించారు. కార్డులపై భూ యజమాని సంతకం అవసరం లేదని వివరించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని, తీసుకున్న రుణంపై సంవత్సరం లోగా చెల్లిస్తే వడ్డీ ఉండదని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, రంగారావు, రాజాబాబు, బైరగాని శ్రీనివాసరావు, మోర్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది నిరసన



నిరసనలో యూనియన్ నాయకులు

లక్ష్మీపురం: పట్టాభిపురంలోని రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది శుక్రవారం నిరసన తెలిపారు. ముందుగా డీఆర్ఎం రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోరై ల్వే మజ్దూర్ యూనియన్ గుంటూరు డివిజన్ అధ్యక్షుడు మంజునాథ్, కార్యదర్శి ఎం.వి ప్రసాద్ మాట్లాడారు. ఓపెన్ లైన్ సిబ్బందికి రిస్క్, హార్డ్‌షిప్ అలవెన్సు చెల్లించాలని, పాయింట్స్‌మెన్ కేటగిరీకి నాలుగు గ్రేడ్ పేలను మంజూరు చేయాలని కోరారు. రూ.4,800, రూ.5,400, రూ.6,600 గ్రేడ్ పే కలిగిన గెజిటెడ్ ఉద్యోగులందరకూ నైట్ డ్యూటీ అలవెన్స్‌ను ఇవ్వాలని తెలిపారు. యూపీఎస్‌లో మార్పుల చేసి పాత పింఛన్ విధానంలో మాదిరిగా ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం లాభాలు చేకూర్చాలని విన్నవించారు. కరువు భత్యం 50శాతానికి పెరిగినందున రన్నింగ్ అలవెన్సులో పెంపుదల చేయాలన్నారు. నిలుపుదల చేసిన డీఏ, డీపీల బకాయిలను సత్వరమే చెల్లించాలని కోరారు. యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శులు కరుణశ్రీ, కోటేశ్వరరావు మాట్లాడుతూ బోనస్ చెల్లింపు విషయంలో ప్రస్తుతం నిర్ధారించిన రూ.7వేలు నెలసరి వేతన పరిమితిని తీసి వేసి ఉద్యోగులు పొందుతున్న వేతనంపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చెల్లిస్తున్న చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్సును పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు పొడిగించాలని కోరారు. సమావేశంలో డివిజనల్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోశాధికారి సాంబశివరావు, డివిజనల్ అధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. మజ్దూర్ యూనియన్ కోశాధికారి కృష్ణయ్య, యూనియన్ నాయకులు రవిశంకర్, ఏడీఎస్ లావణ్య, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు కె.వి.ఎస్. ప్రసాద్ ప్రసంగించారు.

గణతంత్ర వేడుకలు పకడ్బందీ నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: గణతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఏర్పాట్లపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ శనివారం సాయంత్రానికి ఏర్పాట్లు మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ, హార్టికల్చర్, విద్య, వైద్య శాఖ, హౌసింగ్, పంచాయతీరాజ్, సివిల్ సప్‌లైస్, జీఎంసీ, అగ్నిమాపక తదితర శాఖల శకటాలను ఆకర్షణీయంగా రూపొందించి పరేడ్‌లో పాల్గొనేట్లు చూడాలని చెప్పారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్, తాగునీటి సదుపాయం, స్నాక్స్, బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వివరించారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఎస్‌ఓ కోమలి పద్మ, డిఆర్డీఏ పిడి విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, డీపీఓ సాయి కుమార్ పాల్గొన్నారు.

భూ రీ సర్వేను పరిశీలించిన జేసీ

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పెరుకలపూడిలో నిర్వహిస్తున్న భూ రీసర్వేను శుక్రవారం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ పరిశీలించారు. పెరుకలపూడి గ్రామాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని కార్యక్రమాన్ని చేపట్టింది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న రీ సర్వేను జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ జిల్లా సర్వే అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గడువులోగా పూర్తి చేయాలని జేసీ సిబ్బందికి సూచించారు.దుగ్గిరాల తహసీల్దార్‌కు పలు సూచనలు చేశారు.పెరుకలపూడి గ్రామ విస్తీర్ణం 1420 ఎకరాలుగా ఉందని, 200 నుంచి 250 ఎకరాలతో ఆరు బ్లాకులుగా విభజించినట్లు జేసీ తెలిపారు. పర్యవేక్షణకు గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్, వీఆర్ఎలతో మూడు టీమ్‌లుగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రైతులు సిబ్బందికి సహకరించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా సర్వే అధికారి, తహసీల్దార్ సునీత, తెనాలి డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్, సర్వేయర్లు పాల్గొన్నారు.

నరాల బలహీనతతో పలురకాల వ్యాధులు

- గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుందరాచారి
- డాక్టర్ సీతారామమ్మ స్మారక బంగారు పతకం ప్రదానం



డాక్టర్ సుందరాచారికి బంగారు పతకం ప్రదానం చేస్తున్న వైద్యులు

తెనాలి: నరాల బహీనతతో మారిపోయే నడక, చేతులు కదలిక, తల తిరగడం వంటి వ్యాధులను సకాలంలో కనుగొనవచ్చని, తగిన చికిత్సతో నయం చేయొచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్, గుంటూరు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి చెప్పారు. తెనాలికి చెందిన ప్రవాస భారతీయ వైద్యురాలు వడ్లమూడి సీతారామమ్మ స్మారకంగా ఐఎంఏ, తెనాలి శాఖలో ఏర్పాటు చేసిన బంగారు పతకాన్ని తొలిగా డాక్టర్ సుందరాచారికి ప్రదానం చేశారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సీతారామమ్మ భర్త డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, ఐఎంఏ, తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్ బంగారు పతకాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుందరాచారి 'స్పెక్ట్రమ్ ఆఫ్ మూమెంట్ డిజార్డర్స్' అనే అంశంపై డాక్టర్ సీతారామమ్మ స్మారక ప్రసంగం చేశారు. డాక్టర్ అనిల్‌కుమార్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.మధుప్రభాకర్‌బాబు మాట్లాడారు. ఐఎంఏ ఉపాధ్యక్షురాలు డాక్టర్ పావని ప్రియాంక, సంయుక్త కార్యదర్శి డాక్టర్ చందు ఉదయ్, కోశాధికారి డాక్టర్ శ్యాం ప్రసాద్, సీనియర్ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి, చందు సాంబశివుడు, సోమశేఖర్, భానుప్రసాద్, సాంబశివరావు, విశ్వమోహన రావు, శేషగిరిరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తగ్గిన ప్రధాన పంటల విస్తీర్ణం

లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ వై.రాధ

గుంటూరు రూరల్: రాష్ట్రంలో ఖరీఫ్–2024లో ప్రధాన పంటల విస్తీర్ణం తగ్గినట్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వై.రాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికత పద్ధతులను ఆచరించటం వల్ల ఉత్పత్తిలో గణనీయమైన లోటు నమోదు కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట కాలానికి సంబంధించిన ప్రధాన పంటలు కోత పూర్తి చేసుకుని మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నానాటికీ పెరిగిపోతున్న సాగు వ్యయం వల్ల ప్రస్తుత పంటల ధరలు రైతులకు నిరాశగానే మిగులుతున్నాయని వివరించారు. ముఖ్యంగా వాణిజ్య పంటలైన పత్తి, మిరప మార్కెట్ ధరలు బెంచిమార్కు ధరల కంటే సుమారు 3 శాతం నుంచి 5శాతం తక్కువగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. పెరిగిన ఉత్పత్తికి తోడు అధిక వర్షాల మూలంగా పంట నాణ్యత దెబ్బతినడం వల్ల గోదాములలో అధికమొత్తంలో సరుకు నిల్వ ఉండటం, ఈ ధరల పతనానికి కారణాలుగా చెప్పుకోవచ్చని తెలిపారు. కంది, పెసర విస్తీర్ణం పెరిగి, శనగ, మినుములు విస్తీర్ణం తగ్గిందని వివరించారు. ఆస్ట్రేలియా నుంచి పెరుగుతున్న శనగ దిగుమతులు, మయన్మార్ నుంచి దిగుమతి అవుతున్న కంది వల్ల ఈ పంటల ధరలు మరింత క్షీణిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పసుపు ధరలు పరోక్ష విపణిలో పెరుగుతున్నప్పటికీ, భారీగా ఉన్న నిల్వల కారణంగా ప్రత్యక్ష విపణిలో కొనుగోళ్లు మందంగా సాగుతున్నాయని చెప్పారు.

మాతృత్వ భావజాలంతో హక్కులు కోల్పోతున్న మహిళలు

- స్త్రీవాద రచయిత్రి ఓల్గా
- 'యోధ' పుస్తక పరిచయ సభ



మాట్లాడుతున్న ఓల్గా

తెనాలి: మాతృత్వ భావజాలం పేరుతో మహిళలు జీవితంలో అడుగడుగునా హక్కులను కోల్పోతున్నారనీ ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా అన్నారు. ప్రముఖ రచయిత్రి భండారు విజయ సంపాదకత్వంలో వచ్చిన 'యోధ' మాతృత్వం–భిన్న వ్యక్తీకరణలు పుస్తక పరిచయం సభ కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక సంస్థ 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఓల్గా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మాతృత్వం అనేది కేవలం సామాజిక భావజాలం మాత్రమేనని పిల్లల్ని కనటం, ఎంతమందిని కనటం, ఎప్పుడు కనాలి? అనే అన్ని అంశాలపై కుటుంబంలోని మగవారిదే నిర్ణయాధికారంగా ఉందని చెప్పారు. ఏ వర్గంలో చూసినా ఒక వయసు వచ్చిన మహిళలు భర్త బాధితులు కాకుండా బిడ్డల బాధితులుగా మిగులుతున్న దుష్టాంతాలు అనేకం ఉన్నాయని వివరించారు. పిల్లలు కలగని మహిళను సమాజం చిన్నచూపు చూస్తోందన్నారు. సరోగసి విధానంలో తాను కనని బిడ్డను పెంచాల్సి రావటం మరో సమస్యగా తెలిపారు. చివరకు బిడ్డల్ని ఎంతమందిని కనాలనే అంశాన్ని ప్రపంచబ్యాంకు, ప్రభుత్వాధినేతలు నిర్ణయిస్తున్న దాఖలాలు ఉన్నాయని సోదాహరణంగా చెబుతూ ఒక దశలో దేశ ఆర్థిక స్థితిగతుల్ని స్త్రీల గర్భసంచులు మోశాయని వ్యాఖ్యానించారు. మాతృత్వం అనే మాయతెరను చించేసి తల్లి హక్కు అనే వాస్తవికతవైపు 'యోధ' నడిపిస్తుందని చెప్పారు. మరో స్త్రీవాద రచయిత్రి మందరపు హైమవతి మాట్లాడుతూ, మాతృత్వం పేరుతో స్త్రీలపై జరుగుతున్న అణచివేత, హింసతో సహా స్త్రీలు పడుతున్న అనేక సమస్యలను యాభైమంది రచయిత్రులు 'యోధ'లో వివరించినట్టు తెలిపారు. పుస్తక సంపాదకురాలు భండారు విజయ 'యోధ' నేపథ్యాన్ని వివరించారు. నల్లూరి క్రాంతి, రాజ్యలక్ష్మి మాట్లాడారు. జుగాష్‌విలి పర్యవేక్షించారు.

గోల్ఫ్ కోచ్ గోపీనాథ్‌కు అభినందన



పొన్నూరు: నేషనల్ గోల్ఫ్ కోచ్ సర్టిఫికెట్‌ను అందుకున్న రాజమండ్రికి చెందిన ఈర్లు గోపీనాథ్‌ను కవి డాక్టర్ కత్తి పద్మారావు అభినందించారు. శుక్రవారం పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో పద్మారావు మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన గోల్ఫ్ క్రీడకు గోపీనాథ్ కోచ్ కావడం దళితులకు గర్వ కారణమని అన్నారు. వ్యక్తిత్వ నిర్మాణాన్ని పెంచుకొని ఇంగ్లిష్ భాషను అధ్యయనం చేయడంతో పాటు, మంచి ప్రవర్తన ద్వారా ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత విశేషాలతో రచించిన పుస్తకాలను డాక్టర్ కత్తి పద్మారావు, గోపీనాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో చుక్కా సాగర్ పాల్గొన్నారు.

సోలో ట్రావెల్ సో బెటర్!



నేడు నేషనల్ టూరిజమ్ డే

పర్యటనలకు మనదేశం పుట్టిల్లు. తీర్థయాత్రలు మన సంస్కృతిలో భాగం. పర్యటన... ఒక పాఠం... రచనకు అదే మూలం. జీవన వైవిధ్యత అధ్యయనానికి ఓ మాధ్యమం. పర్యటనలు ఒత్తిడి నుంచి సాంత్వన కలిగిస్తాయి. జీవితాన్ని కొత్తగా చూడడానికి కళ్లు తెరిపిస్తాయి. అణగారిన జీవితేచ్ఛను తిరిగి చిగురింపచేస్తాయి. అందుకే... ఫ్రెండ్స్‌తో టూర్‌లు... ఫ్యామిలీ టూర్‌లు... అలాగే... మహిళల సోలో ట్రావెల్స్ కూడా పెరిగాయి.

మహిళలు ఒంటరిగా పర్యటనలు చేయడానికి సందేహించాల్సిన అవసరమేలేదిప్పుడు. ప్రపంచంలో మనుషులందరినీ కలిపే భాష ఇంగ్లిష్. మనదేశంలో పర్యటనలైనా, విదేశీ పర్యటనలైనా ఇంగ్లిష్ భాష వస్తే చాలు. అనర్గళంగా మాట్లాడే నైపుణ్యం లేకపోయినప్పటికీ మనకు అవసరమైన సమాచారాన్ని అడగగలగడం, చెప్పింది అర్థం చేసుకోవడం తెలిస్తే చాలు. సేఫ్టీ, సెక్యూరిటీ నియమాలు పాటిస్తూ ప్రయాణం కొనసాగిస్తే మహిళలు ఒంటరిగా ప్రయాణించినా సరే ఎటువంటి ఇబ్బందులూ ఎదురు కావన్నారు రజని లక్కా. ఆత్మవిశ్వాసం ఉండాలి, కనీసం ఆత్మవిశ్వాసంతో ఉన్నట్లు కనిపించి తీరాలి. బిత్తర చూపులు చూస్తే మోసగించేవాళ్లు అక్కడిక్కడే ప్రత్యక్షమవుతారు. మరో తప్పనిసరి జాగ్రత్త ఏమిటంటే సహ ప్రయాణికులతో కూడా డబ్బు లావాదేవీలు చేయకూడదు. అలాగే పర్యటనను ఆస్వాదించాలంటే లగేజ్ తక్కువగా ఉండాలి. ట్రావెల్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. సోలోగా పర్యటనకు వెళ్లిన వాళ్లు ఇంట్లో వాళ్లకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తుండాలి. అయితే లైవ్ లొకేషన్స్ ఇతరులకు ఎవ్వరికీ షేర్ చేయవద్దు. సోషల్‌మీడియాలో లైక్‌ల కోసం తాపత్రయపడి టూరిస్ట్ ప్లేస్‌లో ఫొటోలు తీసుకుని గంటకో పోస్ట్ పెడుతూ ఉంటే మన కదలికలు ఎప్పటికప్పుడు ప్రపంచానికి తెలిసిపోతుంటాయి. మనల్ని ఎవరైనా రహస్యంగా వెంటాడుతున్నట్లయితే చేజేతులా వారికి దారి చూపించినట్లవుతుంది. పర్యటన వివరాలను సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌తో షేర్ చేయాలనుకుంటే పర్యటన పూర్తయి ఇంటికి వచ్చిన తర్వాత పోస్ట్ చేసుకోవచ్చు. ఇలాంటి కొన్ని జాగ్రత్తలతో ఒంటరిగా ప్రయాణం చేయవచ్చని చెబుతున్నారు జెన్నిఫర్. మనవాళ్లకు అడ్వెంచర్ టూర్‌లు చేయడం కంటే నియమాలను ఉల్లంఘించడంలో సాహసాన్ని ప్రదర్శిస్తుంటారు. ఫొటోగ్రఫీ నిషేధం అన్న చోట ఫొటోలు తీసుకుంటారు. సెక్యూరిటీ కళ్లు కప్పి నిషేధిత ప్రదేశాల్లోకి, డేంజర్ జోన్‌లలోకి దొంగ చాటుగా వెళ్లే ప్రయత్నం చేస్తుంటారు. అలాంటి ప్రయత్నాలు ప్రమాదకరం మాత్రమే కాదు నేరం కూడా. పర్యటనను ఆస్వాదించడం కూడా ఒక కళ. ఎప్పటికీ వన్నె తగ్గని కళ.

మనదేశం ప్రపంచానికి ప్రతీక

కశ్మీర్‌లో తప్ప సోలో ట్రావెలర్‌గా మరెక్కడా నాకు ఇబ్బంది ఎదురుకాలేదు. తమిళనాడు ప్రజలు సింపుల్‌గా ఉంటారు. 76 దేశాల్లో పర్యటించిన తరవాత నాకనిపించిందేమిటంటే... ప్రపంచంలో ఉన్నవన్నీ మనదేశంలో ఉన్నాయి. మనదేశంలో లేనిది ప్రపంచంలో మరెక్కడా లేదు. గుజరాత్‌లోని కచ్ ప్రాంతం బొలీవియాను తలపిస్తుంది. మన దగ్గర ఎడారులు, హిమాలయాలు, బీచ్‌లు ఒక్కొక్కటి ఒక్కోదేశంలో ప్రత్యేకమైన టూరిస్ట్ ప్లేస్‌ను తలపిస్తాయి. ఆర్కిటెక్చర్ పరంగా తమిళనాడు ఆలయాలు, రాజస్థాన్ కోటలకు ప్రపంచంలో మరేవీ సాటి రావు.

– పానుగోటి నీలిమ, ట్రావెలర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

సురక్షితంగా వెళ్లిరావచ్చు!



ఒంటరి పర్యటనలు ఆస్వాదించే వారి సంఖ్య పెరుగుతోంది. కెనడాలో మాంట్రియల్‌లో నేను ప్రయాణించిన టూరిస్ట్ బస్‌లో తొమ్మిది దేశాల వాళ్లున్నారు. అంత మందిలో ఇద్దరు మినహా అంతా సోలో ట్రావెలర్సే. అయితే వెళ్లే ముందు పర్యటనకు వెళ్లే ప్రదేశం గురించి ప్రాథమిక వివరాలైనా తెలుసుకోవాలి. ఇప్పుడు ఇంటర్నెంట్, జీపీఎస్ సౌకర్యాలున్నాయి కాబట్టి స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు, ధైర్యంగా ఒంటరి ప్రయాణాలు చేయవచ్చు. భద్రంగా వెళ్లి, సంతోషంగా తిరిగి రాగలిన పరిస్థితులున్నాయి.

– రజని లక్కా, సోషల్ యాక్టివిస్ట్

ట్రావెల్ లైట్... ట్రావెల్ సేఫ్

ఈశాన్య రాష్ట్రాలు మినహా దేశమంతటా పర్యటించాను. ఏడు దేశాలు కూడా చూశాను. మనల్ని మనం మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగింది పర్యటన ద్వారానే. సోలో ట్రావెల్ అయితే మన అభిరుచికి తగినట్లు టూరిస్ట్ ప్రదేశాలను ఎంచుకోవచ్చు. ఇప్పుడు పర్యటనలకు సౌకర్యాలు బాగున్నాయి. సోలో ట్రావెల్‌లో అన్నీ మనమే సమకూర్చుకోవడం కష్టం అనిపిస్తే టూర్ ప్యాకేజ్‌లో వెళ్లవచ్చు. ఎక్కడికి వెళ్తే ఆ ప్రదేశంలో స్థానికులతో కలిసిపోతున్నట్లుగా ఉండాలి. మనల్ని మనం ఎక్స్‌పోజ్ చేసుకునే ప్రయత్నం చేయరాదు. ఆ ప్రదేశానికి సరిపోలని వస్త్రధారణ, మాటల ద్వారా ఇతరుల దృష్టి మన మీద సులువుగా పడుతుంది. ప్రమాదాలు కూడా అక్కడి నుంచే మొదలవుతాయి. సోలో ట్రావెల్ చేసే మహిళలు జాగ్రత్తగా ఉండాల్సింది ఈ విషయంలో మాత్రమే.



– జెన్నిఫర్ ఆల్ఫాన్స్, డైరెక్టర్

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మీసాలు.. గడ్డాలకు ఖరీదైన తైలాలు





మింగ మెతుకు లేదు గాని మీసాలకు సంపెంగ నూనె అని మనకో సామెత ఉంది. స్తోమతకు మించి డాబులొలికే దిలాసారాయుళ్ల తీరును ఎద్దేవా చేయడానికి పుట్టిన సామెత అది. ఆనాటి సమాజంలో సంపన్నులైన పెద్దమనుషులు మీసాలకు సంపెంగ నూనెలు, ఇతరేతర సుగంధ తైలాలను పూసుకుంటూ, దర్జా ప్రదర్శించేవారు. ఇదివరకు కాస్త వయసు మళ్లినవాళ్లే ఏపుగా గడ్డాలు పెంచేవాళ్లు. ఇటీవలి కాలంలో కుర్రాళ్లు కూడా ఎడాపెడా గడ్డాలు పెంచేసుకుంటున్నారు. కొందరు అడ్డదిడ్డంగా గడ్డాలు పెంచుకుంటూ, చిరిగిన జీన్స్ తొడుక్కుని వీథుల్లో ఆవారాగా తిరుగుతుంటే, ఇంకొందరు సూటు బూట్లు ధరించి, పద్ధతిగా గడ్డాలను రకరకాల తీరుల్లో కత్తిరించుకుంటూ, గడ్డాలు దట్టంగా పెరగడానికి నానా రకాల పోషక తైలాలు వాడుతున్నారు. గడ్డాల మీద యువతరం మోజు గమనించిన మార్కెట్ శక్తులు ఊరుకుంటాయా? యువకుల మోజును సొమ్ము చేసుకోవడానికి గడ్డాల పోషణకు ప్రత్యేకంగా రూపొందించిన రకరకాల తైలాలను మార్కెట్‌లో ముంచెత్తుతున్నాయి. బియర్డ్ ఆయిల్స్, బియర్డ్ క్రీమ్స్ పురుషుల సౌందర్య ఉత్పత్తులలో కీలకంగా మారిపోయాయి. తలకు రాసుకునే హెయిరాయిల్స్, బ్రిలియంటైన్స్, జెల్స్‌తో పోల్చుకుంటే మీసాలు గడ్డాలకు పూసుకునే బీర్డ్ ఆయిల్స్, క్రీమ్స్ ధరలు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటున్నా, గడ్డాలరాయుళ్లు ఏమాత్రం వెనుకాడటం లేదు.

మంచి ఆరోగ్యాన్ని తేగలవు

చలికాలం మొదలు కాగానే మార్కెట్టులో విరివిగా కనిపించే వాటిలో తేగలు ఒకటి. వీటిని కొన్ని ప్రాంతాలలో గేగులు అని అంటారు. వీటిని తినేందుకు కొందరు ఇష్టపడరు. అయితే తేగల్లో ఆరోగ్య పోషకాలు పుష్కలంగా వున్నాయి. అవేంటో తెలుసుకుంటే ఇప్పుడైనా వీటిని తినేందుకు త్వరపడతారు.

తేగలను ఉడికించి మిరియాలు, ఉప్పు అద్దుకుని తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు. తేగలు తింటే బరువు తగ్గడంతోపాటు కాన్సర్ కూడా దూరం అవుతుంది. అలాగే తేగలను ఉడికించి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని పిండి కొట్టి, కొబ్బరిపాలు, బెల్లం, ఏలకుల పొడి చేర్చి తీసుకుంటే కొలెస్ట్రాల్ ఇట్టే కరిగిపోతుంది.



తేగలపిండితో రొట్టెలు చేసుకుని తినొచ్చు. ఇందులోని పీచు జీర్ణక్రియకు ఎంతగానో తోడ్పడుతుంది. పెద్ద పేగుల్లో మలినాలను చేరకుండా చేస్తుంది. టాక్సిన్లను తొలగిస్తుంది. ఇందులోని కాల్షియం ఎముకలకు బలాన్నిస్తుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తంలో తెల్ల కణాలను వృద్ధి చేస్తుంది. శరీరానికి చలువనిచ్చి, నోటిపూతను తగ్గిస్తుంది. తేగలను పాలలో ఉడికించి ఆ పాలను చర్మానికి పూతలా రాసుకుంటే చర్మం మిలమిలలాడుతుంది.

తేగలు దొరికే రోజుల్లో పిల్లలకు రెగ్యులర్‌గా వీటిని పెడితే ఎముకల ఎదుగుదలకు దోహద పడుతుంది. తాటి తేగలను మధుమేహం ఉన్నవారు కూడా తినవచ్చు. రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించి మధుమేహాన్ని అదుపు చేస్తుంది. రక్తం తక్కువగా ఉండి అనీమియాతో బాధపడుతున్నవారు ఈ సీజన్‌లో వచ్చే తేగలను తింటూ ఉంటే మంచి ఫలితం కనపడుతుంది. మంచిది కదా అని అతిగా తింటే మాత్రం చెరుపు చేస్తుంది.



● యోగా

ఎముకల బలానికి అధో ముఖం

ఎముకలు, కండరాలను బలోపేతం చేయడానికి, అకస్మాత్తుగా పడిపోయే ప్రమాదాన్ని నివారించగల శక్తి అధోముఖానానికి ఉంది. రోజూ ఈ ఆసనాన్ని దినచర్యలో భాగం చేస్తూ ఉంటే మైండ్, బాడీ చురుకుదనం పెరుగుతుంది.

ఇలా వేయాలి....

● మ్యాట్ పైన లేదా నేలపైన నిటారుగా నిల్చొని చేతులను పైకి స్ట్రెచ్ ఉంచాలి. తర్వాత నడుం భాగం వంచుతూ, చేతులను పూర్తిగా నేలమీద ఆనించాలి. ● చేతులను పాదాలకు దూరంగా తీసుకెళుతూ త్రికోణాకారంలో ఉండాలి.● కాలి వేళ్ల మీద ఉంటూ మడమలను పైకి లేపాలి. శరీర బరువు చేతులు, కాలి ముని వేళ్ల మీద ఉంటుంది. ● నిమిషం సేపు ఇదే భంగిమలో ఉండాలి. తిరిగి యథాస్థితికి రావాలి. ఇలా ఒకటి నుంచి 3 సార్లు ఈ ఆసనాన్ని పునరావృతం చేయాలి.

ఈ ఆసనం వేయటానికి మొదట్లో కాస్త కష్టంగా వున్నా రోజూ సాధన చేస్తూ ఉంటే సులువవుతుంది. వెన్నెముక, కాళ్లను బలోపేతం చేస్తుంది. అదే విధంగా ఏకాగ్రత పెంచి, ఒత్తిడి నుండి రిలీఫ్‌ని ఇస్తుంది. అజీర్తి సమస్యలు దూరమవుతాయి. నడుము నొప్పి తగ్గుతుంది. ఆస్టియోపోరోసిస్ సమస్య నుండి రక్షిస్తుంది. సైనస్, ఆస్తమా, పీరియడ్స్‌లో వచ్చే సమస్యల నుంచి రిలీఫ్‌ని ఇస్తుంది. ఇన్ని ప్రయోజనాలని ఈ ఆసనం ద్వారా పొందవచ్చు.

సాక్షి సినిమా

వేసవిలో జాట్

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా టాలీవుడ్ దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన హిందీ చిత్రం 'జాట్'. రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా ఇతర పాత్రల్లో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ఈ చిత్రాన్ని వేసవిలో ఏప్రిల్ 10న విడుదల చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించి, కొత్త పోస్టర్ విడుదల చేశారు. ''భారీ యాక్షన్ మూవీగా 'జాట్' రూపొందింది. 'పుష్ప 2: ది రూల్' సినిమాతో పాటు ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్లలో ప్రదర్శితమైన 'జాట్' టీజర్‌కి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: రిషి పంజాబీ, సీఈఓ: చెర్రీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: బాబా సాయికుమార్ మామిడిపల్లి, జయ ప్రకాశ్ రావు (జేపీ).



● సన్నీ డియోల్

టాక్సిక్‌లో ఫిక్స్

'కేజీఎఫ్: చాప్టర్ 1, కేజీఎఫ్: చాప్టర్ 2' వంటి చిత్రాలతో రాకీ భాయ్‌గా పాన్ ఇండియా స్థాయిలో ఎంతో గుర్తింపు సొంతం చేసుకున్నారు యశ్. ఆ సినిమాల తర్వాత యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ చిత్రానికి మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె. నారాయణ, యశ్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ కొన్నాళ్లుగా జరుగుతోంది. అయినప్పటికీ హీరోయిన్ ఎవరనే విషయంపై చిత్రయూనిట్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో కియారా అద్వానీ, కరీనా కపూర్, నయనతార వంటి హీరోయిన్ల పేరు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా యశ్‌కి జోడీగా నయనతార నటిస్తున్నట్లు ఈ మూవీలో కీలక పాత్ర చేస్తున్న బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ మాటలతో స్పష్టత వచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అక్షయ్ ఒబెరాయ్ మాట్లాడుతూ– ''యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమా షూటింగ్‌తో ప్రస్తుతం బిజీగా ఉన్నాను. ఇందులో నయనతార కూడా భాగమయ్యారు. ఇంతకు మించి వివరాలను నేను ఇప్పుడే వెల్లడిస్తే బాగోదు కాబట్టి నన్ను ఎక్కువగా అడగకండి. త్వరలోనే గీతూ మోహన్‌దాస్ ఓ ప్రకటన చేస్తారు. అప్పటివరకు వేచి చూడండి'' అని పేర్కొన్నారు. ఇక నయనతార గురించి దర్శక–నిర్మాతల నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది.



● నయనతార



● పాయల్ రాజ్‌పుత్

అంతే తేడా!

'ఇట్స్ ఓకే.. మూవ్ ఆన్ అవ్వాలిరా.. తప్పదు' అంటూ అనంతిక సనీల్‌కుమార్ చెప్పిన డైలాగ్‌తో '8 వసంతాలు' మూవీ టీజర్ ఆరంభమైంది. 'మ్యాడ్' మూవీ ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా పసునూరి, స్వరాజ్ రెబ్బా ప్రగడ, సమీరా కిశోర్ ఇతర పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. ''ఎవరి తుఫాన్‌లు వారికి ఉంటాయి లోపల... కొందరు బయట పడతారు, ఇంకొందరు ఎప్పటికీ పడరు... అంతే తేడా'' అంటూ కన్నా పసునూరితో అనంతిక సనీల్ కుమార్ చెప్పే డైలాగ్స్ కూడా టీజర్‌లో ఉన్నాయి. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, కెమేరా: విశ్వనాథ్ రెడ్డి.



● రవితేజ, అనంతిక

అఖండలో...



● సంయుక్తా మీనన్

'సింహా, లెజెండ్, అఖండ' వంటి హిట్ సినిమాల తర్వాత హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ మూవీలో హీరోయిన్‌గా సంయుక్తా మీనన్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని చిత్రయూనిట్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఎం. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం మహా కుంభమేళాలో జరుగుతోంది. సినిమాలోని కీలక సీన్స్ షూట్ చేస్తున్నారు. అయితే ఇప్పటివరకూ హీరోయిన్ ఎవరు? అనే విషయంపై చిత్రబృందం ప్రకటించ లేదు. తాజాగా సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా ఎంపిక అయినట్లు మేకర్స్ ప్రకటించారు. సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: సి. రాంప్రసాద్, సంతోష్ డి.

వెంకటలచ్చిమి ప్రతీకారం

'ఆర్‌ఎక్స్ 100, వెంకీ మామ, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, మంగళవారం' వంటి పలు సినిమాల్లో నటించి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు పాయల్ రాజ్‌పుత్. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో 'వెంకటలచ్చిమి' అనే పాన్ ఇండియా చిత్రం ఆరంభమైంది. ముని దర్శకత్వంలో సినిమా టికెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రాజా, ఎన్ఎస్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం అనంతరం ముని మాట్లాడుతూ– ''వెంకటలచ్చిమి' కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిగ్గా సరిపోతారనిపించింది. గిరిజన ప్రాంతానికి చెందిన వెంకటలచ్చిమి అనే అమ్మాయి ప్రతీకారం, యాక్షన్ నేపథ్యంలో ఈ మూవీ ఉంటుంది. ఈ సినిమాని తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో తెరకెక్కిస్తున్నాం'' అని తెలిపారు. పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ– ''మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నా, నచ్చకపోవడంతో తిరస్కరించాను. మునిగారు 'వెంకటలచ్చిమి' కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఈ చిత్రం తర్వాత నా పేరు వెంకటలచ్చిమిగా స్థిరపడిపోతుందేమో అనేంత బలమైన కథ ఇది''అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బడిశా.

ప్రేమ కోసం...

విరాజ్ రెడ్డి చీలం హీరోగా నటించిన చిత్రం 'గార్డ్'. రివెంజ్ ఫర్ లవ్ (ప్రేమకోసం ప్రతీకారం) అనేది ఉపశీర్షిక. జగ పెద్ది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మిమీ లియానార్డ్, శిల్పా బాలకృష్ణ హీరోయిన్లుగా నటించారు. అనసూయ రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఫిబ్రవరిలో విడుదల కానుంది. శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలతో రూపొందిన చిత్రం 'గార్డ్'. సుశాంత్ అనే సెక్యూరిటీ గార్డుగా విరాజ్ కనిపిస్తారు. విరాజ్ యాక్షన్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకునేలా ఉంటాయి. యాక్షన్–ప్యాక్డ్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో లవ్ ట్రాక్ కూడా ఉంటుంది. ప్రేమ పేరుతో ఊహించని శక్తులపై హీరో చేసే పోరాటాలు ఈ సినిమాకు హైలెట్'' అని యూనిట్ పేర్కొంది.



● విరాజ్ రెడ్డి

ఓటీటీ ఇది చూడొచ్చు

బీ కేర్‌ఫుల్...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం డేంజరస్ వాటర్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



జీవితమన్నది క్షణభంగురం. ఏ క్షణానికి ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. కాబట్టి అనుక్షణం అప్రమత్తత అవసరం. ఈ నేపథ్యంలోనే రూపొందిన హాలీవుడ్ సినిమా 'డేంజరస్ వాటర్స్'. ఇదో పూర్తి థ్రిల్లర్ జోనర్ మూవీ. సినిమా మొత్తం ఓ మూడు పాత్రలతో 90 శాతం సముద్రంలోనే జరిగిన కథ. సినిమాలో ఉన్నది మూడు పాత్రలే అయినా మంచి స్క్రీన్‌ప్లేతో చూసే ప్రేక్షకులను మాత్రం కట్టిపడేసే ప్రయత్నం చేశారు దర్శకుడు జాన్ బర్. ఈ సినిమా లయన్స్ గేట్ ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. ఇది పెద్దవాళ్లు మాత్రమే చూసే సినిమా. ఇక ఈ చిత్రకథ విషయానికొస్తే... అల్మా తన కూతురు కోసం ఓ సూపర్ వెకేషన్ ప్లాన్ చేస్తుంది. తన బాయ్ ఫ్రెండ్ డెరెక్‌తో కలిసి కూతురుతో పాటు బోట్‌లో బెర్ముడా వరకు ట్రావెల్ చేసి, సముద్రం మధ్యలో తన బర్త్ డే సెలబ్రేట్ చేసుకోవాలన్నది ప్లాన్. దీనికి కూతురు రోజ్ అయిష్టంగానే ఒప్పుకుంటుంది. ప్రయాణం మొదలైనపుడు అంతా బాగానే ఉంటుంది. దారి మధ్యలో వేరే ఒక బోట్ వీళ్లకు ఎదురుగా వచ్చి అల్మాను చంపేసి డెరెక్‌ను గాయపరుస్తారు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనలో నడి సంద్రంలో రోజ్ ఒంటరిదైపోతుంది. దాడి చేయడానికి వచ్చినవాళ్లు బోట్‌లోని రేడియోను అలాగే బోట్ ఇంజన్‌ను ధ్వంసం చేసి వెళతారు. చుట్టూ నీళ్లు తప్ప ఏమీ లేని ఆ ప్రాంతం నుండి రోజ్ ఎలా బయటపడిందనేది సినిమాలోనే చూడాలి. ఈ సినిమా చాలా నెమ్మదిగా ప్రారంభమై, ఉత్కంఠభరితంగా సాగుతూ ఊహకందని క్లైమాక్స్ ట్విస్టులతో అద్భుతంగా ముగుస్తుంది. గంటా నలభై నిమిషాల నిడివితో సాగే ఈ సినిమా ఎక్కడా బోర్ కొట్టదు. థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవాళ్లకి ఇదో సూపర్ సినిమా. మరింకేం... ఈ వీకెండ్ 'డేంజరస్ వాటర్స్'లోకి మీరూ ట్రావెల్ చేయండి.

– ఇంటూరు హరికృష్ణ